క్లుప్తంగా

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

రేణిగుంట: రేణిగుంట పంచాయతీలో కుక్క కాట్లు పెరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం గ్రామ పంచాయతీ, వెటర్నరీ శాఖ సంయుక్తంగా పట్టణంలోని కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పంచాయతీ ఈఓ మాధవి మాట్లాడుతూ.. నేటి నుంచి 4 రోజులపాటు ప్రతి కుక్కకు వ్యాక్సిన్ ఇస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


సంఘటనా స్థలంలో గాయపడిన బాలాజీ

నాగలాపురం: మండలంలోని బైటకొడియంబేడు వద్ద పుత్తూరు–చెన్నై హైవే గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు కేవీబీపురం మండలం మారప్పరెడ్డికండ్రిగకు చెందిన బాలాజీ, నాగలాపురం మండలం చిన్నాపట్టు గ్రామానికి చెందిన మౌర్య ఇద్దరు బైక్‌పై చిన్నాపట్టు నుంచి నాగలాపురానికి బయలుదేరారు. మార్గమధ్యలో తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బాలాజీ (36) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు


అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ముక్కంటిని దర్శించుకున్న నారా బ్రాహ్మణి


ఆలయం వద్ద నారా బ్రాహ్మణి తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

అక్రమార్కులపై చర్యలేవీ?

- వాహనాల సీజ్‌తో సరిపెడుతున్న అధికారులు
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- మొక్కుబడి చర్యలపై పలు విమర్శలు


జేసీబీ పెట్టి ఇసుకను తోడేస్తున్న దృశ్యం (ఫైల్)

రేణిగుంట : మండలంలోని స్వర్ణముఖీనదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై అధికారులు తీసుకుంటున్న చర్యలు విమర్శలకు తావిస్తున్నాయి. ఏదైనా పత్రికల్లో వచ్చినప్పుడు దాడులు నిర్వహించి వాహనాలను సీజ్ చేసి తమ పని అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు. విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా వారి వివరాలు అధికారులకు తెలిసినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.

యథేచ్ఛగా అక్రమ రవాణా

అధికారులు వాహనాన్ని సీజ్ చేసి నామ మాత్రపు చర్యలు తీసుకుంటుండడంతో ఇదే అదునుగా భావిస్తున్న ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. జేసీబీ , ట్రాక్టర్లు సీజ్ చేస్తే పది రోజుల్లో ఫైన్ కట్టి మళ్లీ యథావిధిగా అక్రమ రవాణా సాగిస్తున్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఇసుక అక్రమ రవాణా అరికట్టలేరని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కనిపించని మైనింగ్ అధికారులు

రెవెన్యూ, పోలీస్ అధికారులు కనీసం నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. కానీ మైనింగ్ అధికారులు మండలంలో కనుచూపు మేరలో కనపడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల్లో ప్రథమ పాత్ర పోషించాల్సిన మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉంటూ చూసి చూడనట్లు ఉంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కనుమరుగయ్యే ప్రమాదం

మండలంలో రాత్రీ, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. అరికట్టాల్సిన అధికారులు కూటమి నాయకుల ఒత్తిళ్లతో చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మరి కొద్ది రోజులకు మండలంలో ఇసుక కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అధిక శాతం ఇసుక బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొన్ని రోజులకు స్థానికులు ఇసుకను బయట ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీసిటీలో కొబెల్కో ఇండియా వార్షికోత్సవం


మాట్లాడుతున్న మునియో టకాహషి, డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కసమోరి


శ్రీసిటీలోని ఆవరణలో తాటి మొక్కలు నాటుతున్న పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జపాన్‌కు చెందిన కొబెల్కో గ్రూప్ అనుబంధ సంస్థలు కొబె స్టీల్ 120వ వార్షికోత్సవం, కోబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (కేసీఈఐ) శ్రీసిటీ ప్లాంట్ 15వ వార్షికోత్సవాన్ని గురువారం శ్రీసిటీ పరిశ్రమ ఆవరణలో వేడుకగా నిర్వహించింది. కార్యక్రమంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహషి, కాన్సుల్ నవోకో యుజావా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కోబెల్కో ఆగ్నేయాసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి, కేసీఈఐ మేనేజింగ్ డైరెక్టర్ – సీఈఓ హయామా, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేసీఈఐ ఆర్దే ఫౌండేషన్‌తో కలిసి పెద్ద ఎత్తున చెట్ల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా శ్రీసిటీ, పులికాట్ సరస్సు పరిసరాల్లో 10,000 తాటి మొక్కలను నాటడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. కొబెల్కో ప్రగతిలో ఇదో మైలురాయిగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభివర్ణించారు.కోబెల్కో ఆగ్నేయాసియా మేనేజింగ్ డైరెక్టర్ కసమోరి మాట్లాడుతూ.. కొబెల్కో సంస్థకు సంబంధించి 2025 ప్రాధాన్యాన్ని హైలైట్ చేశారు.

పరామర్శ


రామ్మూర్తి యాదవ్‌కు నివాళి అర్పిస్తున్న నూకతోటి రాజేష్

నారాయణవనం: మండలంలోని సముదాయం పంచాయతీ ఉపసర్పంచ్ విమల భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మూర్తి యాదవ్ (64) మృతి చెందడంతో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ గురువారం సముదాయం చేరుకుని రామ్మూర్తికి నివాళులర్పించి, ఉపసర్పంచ్ విమలను పరామర్శించారు. మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, నాయకులు హేమచంద్రారెడ్డి, బలరాంమండడి, చలపతిరెడ్డి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవం


ఫార్మసిస్టులతో అమర హాస్పిటల్ యాజమాన్యం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలోని అమర హాస్పిటల్‌లో గురువారం ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అమర హాస్పిటల్ చైర్మన్ డా.గౌరినేని ప్రసాద్ , మేనేజింగ్ డైరెక్టర్ డా.గౌరినేని రామాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు రోగుల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ హెడ్స్ నరసింహ రవి, భాగ్యలక్ష్మి, ఫార్మసీ టీమ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు సన్మానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని సీనియర్ ఫార్మసిస్ట్ రాము గుప్తాను, జూనియర్ ఫార్మసిస్టు చక్రపాణిని గురువారం తిరుపతి జిల్లా డ్రగ్గిస్ట్ అండ్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అమరా జనార్దన్ సత్కరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

సత్యవేడు: సంఘాల్లో పేద మహిళల ఆర్థికాభివృద్ధి చెందేందుకే మహిళా సమాఖ్య కృషి చేస్తోందని ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పెరటి కోళ్ల పెంపకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఇన్బ, కార్యదర్శిగా నందిని, కోశాధికారిగా గోమతి, ఉపాధ్యక్షురాలిగా సాయి మహేశ్వరి, ఉప కార్యదర్శిగా చిత్రను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీలు పుల్లయ్య, శివకుమార్, మంగయ్య, కాంచన కోటేశ్వరి, మంజుల, వీఓ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళలు ఆర్థికంగా బలపడాలని, అందుకు తగిన విధంగా ప్రభుత్వం ఇచ్చే రుణాలను సుస్థిర జీవనోపాధి దిశగా అభివృద్ధి చేసుకోవాలని ఏపీఎం మునెయ్య తెలిపారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవా తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుతో భవిష్యత్తుకు పునాదులు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: ఒకేషనల్ కోర్సుతో విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసుకోవచ్చని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ కోర్స్ దసరా సెలవుల్లోనూ పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎలక్ట్రానిక్ షాపుల్లో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వస్తువుల పనితీరుపై ప్రాక్టికల్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైనర్ అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సామాజిక సేవలో మమేకం


వరదయ్యపాళెం హైస్కూల్‌లో డ్రిల్ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వరదయ్యపాళెం: ధైర్యసాహసాలను అలవరుచుకోవడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, దేశ రక్షణలో మమేకం కావాలనే కల నెరవేర్చుకోవడంలో ఎన్‌సీసీ తోడ్పడుతోంది. మండలంలోని వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఆర్మీ, నేవీలో శిక్షణ ఇస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పాల్గొని గుర్తింపు పొందారు. సైనిక వందనం, స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనడం, కవాతు, మొక్కలను నాటడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సాయం చేయడం వంటి అనేక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



ఎన్‌సీసీతో విద్యార్థులు క్రమ శిక్షణతో పాటు ఉన్నత భవిష్యత్తు పొందవచ్చు. ప్రస్తుతం విద్యార్థులు ఆత్మ రక్షణతో పాటు, దేశ రక్షణకు ఆకర్షితులవుతున్నారు. సామాజిక సేవలో మమేకం అవుతున్నారు.

–రమణయ్య, ప్రధానోపాధ్యాయులు, వరదయ్యపాళెం హైస్కూల్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


వేణురెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీ నాయకులు, సాయిలతా మెడికల్స్ అధినేత మునిరెడ్డి సోదరుడు వేణురెడ్డి ఆకస్మికంగా మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గోరా, ఉదయ్‌కుమార్, ఫజల్, మునికృష్ణారెడ్డి, జీవీకే రెడ్డి పాల్గొన్నారు.


రామయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

న్యాయవాది కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి: పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆరూరు సుధాకర్ తండ్రి ఆరూరు రామయ్య మొదలియార్ ఇటీవల మరణించారు. గురువారం ఆయన కర్మక్రియలకు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, అంజూరు లక్ష్మణ గిరిబాబు, కంటా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో అడుగడుగునా అవకతవకలు


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం సాయంత్రం ఒక పత్రికా ప్రకటనలో మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకల గురించి వివరించారు. 50 వేల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత 16 వేల పోస్టుల భర్తీకి పరిమితమైందన్నారు. నార్మలైజేషన్ ప్రక్రియతో మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరగడంతో పాటు రిజర్వేషన్ ప్రక్రియకు విఘాతం కలిగిందని ఆక్షేపించారు. మెరిట్ లిస్టును బహిర్గతం చేయకుండా అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. డీఎస్సీలో జరిగిన అవకతవకల వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు.

పని గంటల పెంపుపై నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీకాళహస్తి : పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి మాట్లాడుతూ.. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు పని గంటలు పెంచిందని ఆరోపించారు. కార్యక్రమంలో మునిచందు, మురళి, శివ, అంజి, పాండు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

రేణిగుంట : కూటమి ప్రభుత్వం కార్మికుల పనిగంటల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కన్వీనర్ సెల్వరాజ్ మాట్లాడుతూ.. కార్మికులతో చర్చించకుండా శాసన సభలో తీర్మానించడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏర్పేడు, రేణిగుంట మండల కన్వీనర్ హరినాథ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజశేఖర్, దీప, సత్యశ్రీ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.







రేణిగుంట: లలితాదేవి అలంకరణ, సత్యవేడు: కాత్యానిదేవి, వరదయ్యపాళెం: అన్నపూర్ణదేవి , కైలాసనాథకోనలో.. తిరువట్యంలో.. అలంకరణలో అవనాక్షమ్మ

అన్నపూర్ణేశ్వరి నమో నమామి




నాగలాపురం: అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు, చంద్రఘంటాదేవి అలంకారంలో ఏడుగంగల అమ్మవారు, కుష్మాండ అలంకారంలో బొమ్మలకొలువులోని జ్ఞానప్రసూనాంబ

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానం నందు అమ్మవారి ఉత్సవమూర్తికి ఊంజల్ సేవ నిర్వహించారు. శ్రీ మరకదాంబికై అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.లత, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేణిగుంట: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేణిగుంట మండలంలోని రామకృష్ణాపురంలో అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితా దేవిగా అమ్మవారిని అలంకరించారు.

సత్యవేడు: మండల కేంద్రంలో సర్వమంగళాదేవి కాత్యానిగా దర్శనమిచ్చారు. గురువారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని కాత్యానిదేవిగా అలంకరించారు.

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు, కైలాసనాథకోనలో కామాక్షాంబిక, తిరువట్యంలోని మూలస్థాన ఎల్లమ్మను అన్నపూర్ణదేవిగా అలంకరించారు. సాయంత్రం అన్నపూర్ణగా ఊంజల్‌సేవలో తరించారు. ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తి: పట్టణంలోని శీతలాంబ అమ్మవారిని గురువారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు పాలమంగళం రవి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుపాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరదయ్యపాళెంలోని చెంగాళపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో, అంబూరులోని శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో కాత్యాయనిదేవిగా కామాక్షమ్మ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు అమ్మవారి ఆలయాలోని అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞాన ప్రసూనాంబిక ఉత్సవమూర్తి ప్రత్యక్షం అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రంగులగోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువులో అమ్మవారు కుష్మాండదేవిగా, కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తిని మన్నారుగుడి రాజగోపాలస్వామిగా అలంకరించారు. వేదాం దక్షిణ కాళికాదేవి బాలత్రిపురసుందరిగా, పొనగల్ గంగమ్మ ప్రత్యేక అలంకారంలో, ఏడుగంగల అమ్మవారు చంద్రఘంటాదేవిగా, ముత్యాలమ్మ, తెట్టుప్రాంతంలోని నల్లగంగమ్మగా దర్శనమిచ్చారు. బీపీఅగ్రహారం గంగమ్మగా, పొన్నాలమ్మ గౌరిదేవిగా, భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారు మధురమీనాక్షి అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బియ్యపు కృష్ణారెడ్డి మండపం వద్ద ఏర్పాటు చేసి కనకదుర్గమ్మను వైష్ణవిదేవిగా అలంకరించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



ర్యాలీ చేస్తున్న నేతలు, సిబ్బంది

శ్రీకాళహస్తి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. స్వచ్ఛతాహి సేవా–25లో భాగంగా స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం కమిషనర్ భవాని ప్రసాద్, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు కాసరం రమేష్, అస్మత్, డిల్లీబాబు, ఆర్ముగం, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, పురపాలక సంఘ సిబ్బంది, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు దసరా సెలవుల్లో సమగ్ర శిక్ష సూచనల మేరకు హెల్త్‌కేర్ విభాగంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, హెల్త్‌కేర్ ట్రైనర్ చంద్రకళ పాల్గొన్నారు.

ధాన్యం పశువులపాలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని పశువులు తినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నీర్పాకోట గ్రామానికి చెందిన రమణయ్య, మరికొంత మంది రైతులు గురువారం మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టారు. పశువులు యార్డులోనికి ప్రవేశించి ఆరబెట్టిన ధాన్యాన్ని పూర్తిగా తినివేయడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.